విద్యా కమిటీల ఎన్నికలు ప్రశాంతం

1958 చోట్ల ఏకగ్రీవం.... 347 చోట్ల పోటీ



కోట మండలం గోవిందపల్లి ఉన్నత పాఠశాలలో చేతులెత్తుతున్న టీడీపీ, వైసీపీ మద్దతు దారులు

తిరుపతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం విద్యాశాఖ నిర్వహించిన పాఠశాల విద్యా కమిటీల ఎన్నికలు స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి.ప్రాథమిక పాఠశాలలు 1846 వుండగా అందులో 1583 చోట్ల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 226 స్కూళ్ళలో పోటీ జరిగింది. మొత్తం మీద 1809 చోట్ల ఎన్నికలు ముగిశాయి. ప్రాథమికోన్నత పాఠశాలలు 186 వుంటే 145 చోట్ల ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. 37 చోట్ల పోటీ నెలకొనగా మొత్తం మీద 182 స్కూళ్ళలో ఎన్నికలు పూర్తయ్యాయి. ఉన్నత పాఠశాలలు 322 వుండగా 230 చోట్ల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 84 చోట్ల పోటీ జరగగా మొత్తంగా 314 హైస్కూళ్లలో ఎన్నికల ప్రక్రియ ముగిసింది.

17 చోట్ల ఎన్నికలు వాయిదా

బాలాయపల్లి మండలంలో ఒక ప్రైమరీ, చిల్లకూరు మండలంలో ఒక యూపీ, చిట్టమూరు మండలంలో ఒక హైస్కూలు చొప్పున మూడు చోట్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. కేవీబీపురం మండలంలో నాలుగు ప్రైమరీ, ఒక హైస్కూలు వంతున ఐదు చోట్ల ఎన్నికలు వాయిదా వేశారు. కోట మండలంలో ఒక ప్రైమరీ,ఒక యూపీ,ఒక హైస్కూలు చొప్పున మూడు చోట్ల ఎన్నికలు నిలిచిపోయాయి. ఆర్సీపురం మండలంలో ఒకటి, తడ మండలంలో ఒకటి, వరదయ్యపాలెం మండలంలో ఒకటి చొప్పున మూడు చోట్ల ఎన్నికలు ఆగిపోయాయి. వెంకటగిరి మండలంలో ఒక హైస్కూలు, ఏర్పేడు మండలంలో ఒక ప్రైమరీ, ఒక హైస్కూళ్ళలో ఎన్నికలు వాయిదా పడ్డాయి.

ఎన్నికల సందర్భంగా స్వల్ప ఘటనలు

- కోట మండలంలోని గోవిందపల్లి ఉన్నత పాఠశాలలో చేతులు ఎత్తేందుకు టీడీపీ, వైసీపీ మద్దతుదారులు 217 మంది హాజరయ్యారు.అయితే ఓటర్లను ప్రలోభపెడుతున్నారంటూ రెండు వర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ బాహాబాహీకి దిగారు. పరిస్థితి గమనించిన విద్యాశాఖ అధికారులు ఎన్నికలను వాయిదా వేశారు.ఊనుగుంటపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో కూడా చైర్మన్ పదవి తమ వర్గానికే కావాలంటూ టీడీపీ, వైసీపీ నాయకులు బాహాబాహీకి దిగడంతో ఎన్నికను వాయిదా వేసినట్లు ఎంఈవో మస్తానయ్య తెలిపారు.
- చిట్టమూరు మండలం యాకసిరి జడ్పీ హైస్కూల్లో లో వైసీపీకి మద్దతు ఇస్తున్నారంటూ ప్రధానోపాధ్యాయుడిపై టీడీపీ వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు వాయిదా వేయాలని పట్టుబట్టడంతో ఎన్నికలు ఆగిపోయాయి.
- వరదయ్యపాలెం మండలం కళత్తూరు పాఠశాలలో ఎన్నిక వాయిదా పడింది. గ్రామస్థుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో గ్రామస్తుల అభ్యర్థనతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.
- కేవీబీపురం మండలం మోడల్ స్కూల్లో ఇరువర్గాల నడుమ వాగ్వాదం జరగడంతో ఉద్రిక్తత నెలకొంది.
- చంద్రగిరి మండలం తొండవాడ హైస్కూల్లో ఎన్నికలు జరుగుతుండగా వైసీపీ నేత మల్లం చంద్రమౌళిరెడ్డి అనుచరులతో వచ్చి ప్రోటోకాల్ పాటించడం లేదని అడ్డుకున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఎస్ఎంసీ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నారు.
- కేవీబీపురం మండలం కోవనూరు, వేమలపూడి, కండ్లూరు, అంజూరుపాలెం పాఠశాలల్లో టీడీపీ, వైసీపీ వర్గీయుల నడుమ సయోధ్య కుదరకపోవడంతో తల్లిదండ్రులు వెళ్ళిపోవడంతో ఎన్నికలు జరగలేదు.

పెళ్లయిన గంటల్లోనే విషాదం

- వధువును హతమార్చి.. వరుడి ఆత్మహత్య
- వాట్సాప్ చాటింగా, మరేదైనా కారణమా?



వివాహ సమయంలో నిఖిత, నవీన్

రామకుప్పం/శాంతిపురం, ఆగస్టు 8: అబ్బాయిది చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం సంతూరు. అమ్మాయిది కర్ణాటక రాష్ట్రం బైనహళ్లి. పెళ్లయింది బుధవారం ఉదయం చంబరసనహళ్లి గ్రామంలో. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే గదిలో నవదంపతుల మధ్య ఏం జరిగిందో కానీ.. కొడవలి దాడితో వధువు మృతి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వరుడు..గురువారం ఉదయం అసువులు బాశాడు. వీరి మృతిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వధువు వాట్సాప్ చాటింగ్ కారణమని కొందరు.. అతడి మానసిక స్థితి సరిగాలేదని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. శాంతిపురం మండలం సంతూరు గ్రామానికి చెందిన జయమ్మ, మునెప్ప దంపతుల కుమారుడు నవీన్ (30) సోదరికి కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ తాలూకా చంబరసనహళ్లికి చెందిన వ్యక్తితో వివాహమైంది. రామకుప్పం, శాంతిపురం మండలాల మధ్య.. కర్ణాటక సరిహద్దు గ్రామమైన రాజుపేట క్రాస్‌లో నవీన్ దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం బైనహళ్లికి చెందిన శ్రీనివాసులు, లక్ష్మీ దంపతుల కుమార్తె నిఖితశ్రీతో నవీన్‌కు బుధవారం ఉదయం చంబరసనహళ్లి (వరుడి సోదరి గ్రామం)లో వివాహమైంది. నవదంపతులిద్దరూ బంధువులతో కొద్దిసేపు ఆహ్లాదంగా గడిపారు. ఆ తర్వాత నిఖితశ్రీతో పాటు ఆమె తల్లిదండ్రులను గ్రామంలోని తన అక్క ఇంటికి నవీన్ తీసుకెళ్లాడు. కొంతసేపటి తర్వాత నవదంపతులు ఓ గదిలోకి వెళ్లారు. కొంతసేపటికే వారి గదిలో నుంచి కేకలు వినిపించాయి. నవీన్ మేనకోడలు కిటికీలో నుంచి చూడగా నిఖితపై అతడు కొడవలితో దాడి చేయడం కనిపించింది. వెంటనే నిఖిత తల్లిదండ్రులు, ఇతర బంధువుల గది తలుపులు బద్దలు కొట్టి లోపలకు వెళ్లారు. అప్పటికే నిఖిత రక్తపుమడుగులో.. పక్కనే నవీన్ తీవ్రగాయాలతో పడున్నారు. వీరిద్దరినీ కోలారులోని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే నిఖిత మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. నవీన్ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అండర్‌సన్ పోలీసులు తెలిపారు. కాగా, ఇష్టపూర్వకంగా పెళ్ళి చేసుకున్న నవీన్.. భార్యను చంపి, తాను ఆత్మహత్యకు పాల్పడటంపై దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.


ఘటన వెనుక ఏం జరిగింది?

ఈ ఘటనపై స్థానికంగా భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొంతకాలంగా నవీన్ మానసిక పరిస్థితి సరిగాలేదని, దీనివల్లే ఈ ఘటన జరిగి ఉండచ్చొని కొందరు చెబుతున్నారు. వధువు సెల్‌ఫోను చాటింగే కారణమని అతడి సన్నిహితులు చెబుతున్నట్లు తెలిసింది. పెళ్లయిన కొద్దిసేపటికే నిఖిత సెల్‌ఫోనులో చాటింగ్ చేయడాన్ని అతడు గమనించాడని అంటున్నారు. అనుమానంతో ఆమె ఫోను తీసుకుని చూడగా ఓ యువకుడితో చాట్ చేసినట్లు గుర్తించాడని చెబుతున్నారు. దీంతో గదిలోకి వెళ్లగానే దీనిపై ప్రశ్నించడం..ఆ నేపథ్యంలోనే ఆమెపై దాడి చేసి హతమార్చి.. తానూ ఆత్మహత్యకు యత్నించి ఉంటాడని భావిస్తున్నారు.

గ్రామంలో విషాదం

జనసేనలో క్రియాశీల కార్యకర్తగా, సౌమ్యుడిగా పేరున్న నవీన్ జీవితం విషాదాంతం కావడం స్థానికులను బాధకు గురిచేసింది. సున్నిత మనస్కుడైన ఇతడు.. ఎవరికీ హాని కలిగించే మనస్తత్వం కాదని స్నేహితులు, జనసేన శ్రేణులు చెప్పారు. అలాంటి వ్యక్తి ఎందుకిలా చేశాడో అర్థం కావడంలేదన్నారు. కాగా నిఖిత అంత్యక్రియలు బైనహళ్లిలో, నవీన్ అంత్యక్రియలు చంబరసనహళ్లిలో జరిగాయి.

తిరుపతి డీఎస్పీగా వెంకటనారాయణ




వెంకటనారాయణ




చెంచుబాబు



విజయశేఖర్



వెంకటాద్రి



రవికుమార్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 8: తిరుపతి డీఎస్పీగా వెంకటనారాయణ నియమితులయ్యారు.గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సీఐగా, డీఎస్పీగా వెంకటనారాయణ పనిచేశారు. 2014లో డీఎస్పీగా పదోన్నతి పొందిన అనంతరం తిరుపతి ట్రాఫిక్‌లో పనిచేసాక ఇక్కడినుంచి గుంటూరు రూరల్‌కు బదిలీపై వెళ్లారు.శుక్రవారం వెంకటనారాయణ తిరుపతిలో బాధ్యతలు తీసుకోనున్నారు. అలాగే తిరుమల డీఎస్పీగా విజయశేఖర్ నియమితులయ్యారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి పొందిన ఈయన చిత్తూరు ఎస్సీ, ఎస్టీ సెల్, తిరుపతి ట్రాఫిక్, కర్నూలు డీఎస్పీగా పనిచేశారు. ఎన్నికల అనంతరం జరిగిన డీఎస్పీల బదిలీల్లో ఆయన్ను వెయిటింగ్ లిస్ట్‌లో పెట్టారు. ఈయనతో పాటు తిరుపతి రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్సు డీఎస్పీగా పనిచేస్తూ డెప్యుటేషన్‌పై తిరుపతి క్రైం డీఎస్పీగా ఏడాది పనిచేసిన రవికుమార్‌ను పుత్తూరు డీఎస్పీగా నియమించారు. తిరుపతి రెడ్ శ్యాండిల్ టాస్క్‌ఫోర్సు డీఎస్పీగా పనిచేస్తున్న చెంచుబాబును నాయుడుపేట డీఎస్పీగా నియమించారు.తిరుపతిలో స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా పనిచేస్తున్న వెంకటాద్రిని రేణిగుంట డీఎస్పీగా నియమించారు.రేణిగుంట డీఎస్పీగా పనిచేస్తున్న భవ్యకిషోర్‌ను రాజమండ్రి సౌత్ జోన్ డీసీపీగా నియమించారు. సీఐడీలో డీఎస్పీగా పనిచేస్తున్న సోమన్నను ఆదోని డీఎస్పీగా ప్రభుత్వం బదిలీ చేసింది. పుత్తూరులో డీఎస్పీగా పనిచేస్తున్న ఎంపర్ల శ్రీనివాసరావు సీఐడీ డీఎస్పీగా నియమితులయ్యారు.

శ్రీకాళహస్తిలో నకిలీ విలేకరి హల్‌చల్



నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి, ఆగస్టు 8: రోడ్డుపై ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న కారును పక్కన పెట్టమన్నందుకు ఓ నకిలీ విలేకరి కానిస్టేబుల్‌పై రెచ్చిపోయి చివరకు అడ్డంగా దొరికిపోయాడు. శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ నరసింహారావు కథనం మేరకు.... ఏర్పేడు మండలం కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనే యువకుడు కారులో గురువారం శ్రీకాళహస్తికి వచ్చాడు. ఆర్టీసీ కూడలి సమీపంలో రోడ్డు పక్కన కారు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ స్తంభించింది. అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ చెంచయ్య కారును పక్కకు తీయాలని నాగేశ్వరరావుకు చెప్పగా వాగ్వాదానికి దిగాడు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేకరినంటూ దురుసుగా ప్రవర్తించాడు. దీంతో కారును స్టేషన్‌కు తరలించారు.నాగేశ్వరరావు వద్ద ఉన్న అక్రిడిటేషన్ కార్డును సీఐ నరసింహారావు పరిశీలించగా అది నకిలీదని తేలింది.పోలీసు విధులకు ఆటంకం కలిగించడం,నకిలీ గుర్తింపుకార్డుతో విలేకరిగా చలామణి కావడంపై కేసు నమోదు చేశారు.

నకిలీ డాక్టర్ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 8: తిరుపతి రుయాస్పత్రిలో డాక్టర్ అని చెప్పి రోగుల సహాయకులను మోసం చేస్తున్న వ్యక్తిని గురువారం వెస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు...సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం నరసంపల్లి తాండాకు చెందిన బనావత్ సాయికుమార్ తిరుపతిలో వుంటున్నాడు.నగదు, మొబైల్ ఫోన్లు కొట్టేయడంలో దిట్ట. మదనపల్లెకు చెందిన అశోక్ తన కుమార్తె దీపికను చికిత్స నిమిత్తం ఇటీవల రుయాస్పత్రికి తీసుకొచ్చాడు. బనావత్ సాయికుమార్ తెల్లకోటు వేసుకుని, స్టెతస్కోపుతో డాక్టర్ అని చెప్పి అశోక్‌ను నమ్మించాడు.అతని వద్ద వున్న మొబైల్ ఫోన్ తీసుకోవడంతో పాటు బ్యాంకు ఖాతా నుంచి రూ 40,000 డ్రా చేశాడు. మోసపోయినట్లు గ్రహించాక అశోక్ తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం తిరుపతి-చెర్లోపల్లి రోడ్డులోని గరుడ సర్కిల్ వద్ద వుండగా సాయికుమార్‌ను అరెస్టు చేసారు. అతని వద్ద నుంచి మొబైల్ ఫోను, రూ 35,000 స్వాధీనం చేసుకున్నారు.



ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు అందజేసే ముందు రాకెట్ నమూనా మెమెంటోను ప్రదర్శిస్తున్న మోహన్‌బాబు

2040లో చంద్రుడి మీదకు అతి తక్కువ ఖర్చుతో తీసుకెళ్తాం

అంతరిక్ష వారోత్సవాల్లో ఇస్రో చైర్మన్ సోమనాథ్

చంద్రగిరి, ఆగస్టు 8: అతి తక్కువ ఖర్చుతో 2040లో మనుషులను చంద్రుడి మీదకు తీసుకెళ్ళేందుకు పరిశోధనలు చేస్తున్నట్లు ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. చంద్రగిరి మండలం, ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అంతరిక్ష వారోత్సవాల్లో గురువారం నేషనల్ స్పేస్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్య అతిధిగా హాజరైన సోమనాథ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చంద్రయాన్ విజయవంతం కావడంతో అంతరిక్షరంగంలో దేశం ప్రతిష్ట పెరిగిందన్నారు. అమెరికా నుంచి ఆస్ట్రేలియా వెళ్లడానికి విమానంలో 30 గంటల సమయం పడుతుందని, అయితే రాకెట్‌లో 30 నిమిషాల్లో చేరేందుకు అమెరికన్ ఇంజనీర్,టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ ప్రయోగాలు జరుపుతున్నార న్నారు.ఎంబీయూ ఛాన్సలర్ మోహన్‌బాబు మాట్లాడుతూ ఇస్రో చైర్మన్ సోమనాథ్ యువ శాస్త్రవేత్తలకు ఆదర్శనీయుడంటూ కొనియాడారు. ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు మాట్లాడుతూ ఇస్రో, ఎన్ఏఆర్ఎల్ సహకారంతో ముందుకెళతామన్నారు.షార్ డైరెక్టర్ రాజరాజన్, ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ అమిత్ కుమార్ పాత్ర, ఎంబీయూ వైస్‌ఛాన్సలర్ నాగరాజరామారావ్, రిజిస్ట్రార్ సారధి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు డీఎంహెచ్‌వో సంతకం ఫోర్జరీ

నెల్లూరు క్రైం,ఆగస్టు 8 : నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సంతకం ఫోర్జరీ చేసిన వ్యక్తిపై సంతపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.... తిరుపతి జిల్లాకు చెందిన కరీముల్లాకు నెల్లూరులోని వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులతో పరిచయాలున్నాయి. దీంతో పలువురు నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకొని, కాంట్రాక్టు ప్రాతిపదికన సాఫ్టనర్సు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు.నెల్లూరు జిల్లాకు చెందిన ఏడుగురి వద్ద రూ.14 లక్షలు వసూలు చేశాడు. అంతటితో ఆగకుండా డీఎంహెచ్‌వో పేరుతో ఉన్న అపాయింట్‌మెంట్ లెటర్ వారికి అందించాడు.వారిలో ఒకరైన వెంకటకృష్ణ ఆ అపాయింట్‌మెంట్ లెటర్ తీసుకుని డీఎంహెచ్‌వో పెంచలయ్యను కలిశాడు. తనకు మర్రిపాడు పీహెచ్‌సీలో పోస్టింగ్ ఇవ్వాలని కోరాడు.కంగుతిన్న డీఎంహెచ్‌వో అందులో ఉన్న సంతకం తనదికాదని, ఎవరో ఫోర్జరీ చేశారని గుర్తించారు. తన సంతకాన్ని ఫోర్జరీ చేసి మోసాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం రాత్రి ఆయన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28 ఆస్పత్రులపై 181 ఫిర్యాదులొచ్చాయ్

పునరావృతమైతే చర్యలు తప్పవన్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(విద్య), ఆగస్టు 8: ఎన్టీఆర్ వైద్య సేవలకు సంబంధించి జిల్లాలోని పలు ఆస్పత్రులపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ చెప్పారు. ఎన్టీఆర్ వైద్యసేవ 12వ డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ మీటింగ్ కలెక్టరేట్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 104 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా 28 ఆస్పత్రులపై 181 ఫిర్యాదులందాయని, ఇవి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.అర్హులైన వారందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలందించాలని ఆదేశించారు.ఆస్పత్రుల యాజమాన్యంతో పాటు ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది, ఎన్టీఆర్ వైద్యమిత్ర, టీంలీడర్, జిల్లా మేనేజర్, కోఆర్డినేటర్లు బాధ్యత వహించాలన్నారు.ఆస్పత్రులకు వెళ్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. మూడు నెలల తరువాత మళ్లీ డిసిప్లినరీ కమిటీ మీటింగ్ నిర్వహిస్తామని ఈలోపు మళ్లీ ఫిర్యాదులు వస్తే తక్షణం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.అన్ని ప్రభుత్వ, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా సంతృప్తికరమైన సేవలందించాలని సూచించారు.డీఎంహెచ్‌వో శ్రీహరి, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా మేనేజర్ శివకుమార్, టీంలీడర్లు, స్విమ్స్, రుయా, మెటర్నిటీ, రష్, అమర, నారాయణాద్రి, రమాదేవి, డీబీఆర్, సీఆర్ రెడ్డి, సంకల్ప ఆస్పత్రుల యజమానులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధిలో సర్పంచులే కీలకం

భాకరాపేట, ఆగస్టు 8: గ్రామాల అభివృద్ధిలో సర్పంచులే కీలకపాత్ర వహించాలని డీఎల్‌పీవో రూపారాణి అన్నారు. గురువారం చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సోమశేఖర్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

భాకరాపేట, ఆగస్టు 8: చిన్నగొట్టిగల్లు మండలంలో 500 మంది జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు మండల అధ్యక్షుడు కొమ్మిశెట్టి రూపేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జయశంకర్, తాయారమ్మ, భాను, ప్రతాప్, మురళి, యశ్వంత్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, ఆగస్టు 8: పార్టీలకతీతంగా అందరూ కలిసిమెలసి గ్రామాల అభివృద్ధికి కృషిచేద్దామని ఎమ్మెల్యే పులివర్తి నాని పిలుపునిచ్చారు.పాకాల మండలంలోని కె.వడ్డేపల్లె పంచాయతీ బొల్లినేని రామయ్యగారిపల్లెలో గురువారం టీడీపీ నాయకులు, గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.తనను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు నానీ కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజ నాయుడు, సర్పంచ్ కె.వరలక్ష్మి, బొల్లినేని దామోదర నాయుడు, బొల్లినేని మహేష్ కుమార్, డాక్టర్ రమణ, జేజబ్బ నాయుడు, తారాపతి, దొరబాబు, కె.సావిత్రి, రమేష్‌బాబు, శశి, జయచంద్ర, ఎం.వెంకటాద్రిబాబు, కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాని


హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాని దంపతులు

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

చంద్రగిరి, ఆగస్టు 8: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవాల్లో రెండోరోజైన గురువారం చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి సుధారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, గణబాబు, భూమా అఖిలప్రియ, తిరుపతి మేయర్ శిరీష, హీరో సంతోష్ శోభన్, ప్రముఖ బాలీవుడ్ నటుడు గోవింద సతీమణి సునీత అహూజా, కుమార్తె నటి టీనా దర్శించుకున్నారు.


సంతోష్ శోభన్ - సునీత, టీనా

వీఎస్వో బాధ్యతల స్వీకారం

తిరుమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ వీఎస్వోగా సురేంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఉదయం శ్రీవారిని దర్శించుకుని బాధ్యతలు స్వీకరించారు.

సామిరెడ్డి ఒడ్డు చెరువు కట్టపై వ్యర్థాల తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

పాకాల, ఆగస్టు 8: మండలంలోని ఇరంగారిపల్లె పంచాయతీ పరిధిలోని సామిరెడ్డి ఒడ్డు చెరువు కట్టపై వ్యర్థాలను పంచాయతీ అధికారులు గురువారం తొలగించారు. ఈ కట్టపై భవన నిర్మాణ వ్యర్థాలను ట్రాక్టర్లతో తీసుకొచ్చి డంప్ చేస్తున్నారని, చెరువు కట్టపై వున్న రోడ్డుకు ఇరువైపులా పేడకుప్పలు వేస్తున్నారని, వాహన రాకపోకలకు అంతరాయం కలుగుతోందని సోమవారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సర్పంచ్ వసంత, కార్యదర్శి సుమలత, వీఆర్వో లోకనాథం, సర్వేయర్ వెంకటేష్ చెరువు కట్టను పరిశీలించారు. పేడదిబ్బలు, భవన వ్యర్థాలు యంత్రాల సాయంతో తొలగించారు. చెరువు విస్తీర్ణాన్ని సర్వేచేయించి ఆక్రమణలు తొలగించాలని, మళ్లీ భవన వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టి చెరువును పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.


సామిరెడ్డి ఒడ్డు కట్టపై వ్యర్థాలను తొలగిస్తున్న అధికారులు

ప్రైవేటు అంబులెన్సుల దందాకు అడ్డుకట్ట వేయండి: బీజేపీ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 8: రుయాస్పత్రికి వచ్చే నిరుపేద రోగులను దోచుకుంటున్న ప్రైవేటు అంబులెన్సుల, మహాప్రస్థానం వాహనాల దందాకు అడ్డుకట్ట వేసి ఆర్థిక దోపిడీకి గురవుతున్న రోగులకు న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ రుయా సూపరింటెండెంట్ రవిప్రభును కోరారు. ప్రైవేటు అంబులెన్సుల దందా విషయంపై ఆయన బీజేపీ నేతలతో కలిసి గురువారం సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన రోగులను ఉచితంగా తీసుకువెళ్లాల్సిన మహా ప్రస్థానం వాహనాల నిర్వాహకులు రోగులనుంచి డబ్బులు డిమాండ్ చేసి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీంతో రోగులు ప్రైవేటు అంబులెన్సులను ఆశ్రయిస్తే.. వారు అధిక మొత్తం నగదు వసూలు చేయడమే కాకుండా రోగుల సొంత వాహనాలను లోపలకు రానీయకుండా అడ్డుపడుతున్నారన్నారు. సూపరింటెండెంట్ రవిప్రభు స్పందిస్తూ.. ఇటువంటివి పునరావతం కాకుండా చూస్తామని, రోగుల నుంచి మహాప్రస్థానం నిర్వాహకులు డబ్బులు తీసుకున్నా, ప్రైవేటు అంబులెన్సుల వారు అధిక మొత్తంలో నగదు డిమాండ్ చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కొత్తపల్లి అజయ్‌కుమార్, వరప్రసాద్, హరి, నవీన్, రెడ్డి బాబు, ఏఆర్ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం: ఒకరి అరెస్టు

మంగళం, ఆగస్టు 8: అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసి, 18 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డస్మగ్లర్ తమిళనాడు, తిరువణ్ణామలై జిల్లా జమునామత్తూరు తాలుకాకు చెందిన దొరస్వామి(47)గా గుర్తించారు.

రామాలయ నిర్మాణానికి సహకరించండి

తిరుపతి రూరల్, ఆగస్టు 8: తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీ పరిధిలోని కాలూరులో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి సహకరించాలని స్థానిక మహిళలు కోరారు. శిథిలావస్థకి చేరిన ఆలయాన్ని పునర్నిర్మిస్తుండగా.. కొందరు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని స్పందించి ఆలయ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.

వైభవంగా ధ్వజారోహణం

రామచంద్రాపురం, ఆగస్టు 8: రామాపురం మహాభారత ఉత్సవాలకు గురువారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది.మధ్యాహ్నం భాగవతారిణి అనసూయ వ్యాసజననం హరికథను వినిపించారు. సాయంత్రం ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోండి

రామచంద్రాపురం, ఆగస్టు 8: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రత్యూష సూచించారు. స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయ భవనంలో గురువారం సర్పంచులు, కార్యదర్శులకు పంచాయతీ అభివృద్ధిపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆమె పలు సూచనలిచ్చారు.

చంద్రబాబుకోసం తిరుమలకు పాదయాత్ర



చంద్రగిరి, ఆగస్టు 8: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలంటూ గతంలో మొక్కుకున్న మొక్కు తీర్చుకునేందుకు బెంగళూరు నుంచి తిరుమలకు టీడీపీ కార్యకర్తలు 58మంది పాదయాత్రగా వచ్చారు. బెంగుళూరు చిక్కల్ సంద్రకు చెందిన అబ్బయ్యనాయుడు టీడీపీ కార్యకర్తలతో గురువారం మధ్యాహ్నం చంద్రగిరి మండలం, మామండూరు వద్దకు రాగానే ఎమ్మెల్యే పులివర్తి నాని వారికి సాదర స్వాగతం పలికి, కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలను అడ్డుకున్న వైసీపీ

చంద్రగిరి, ఆగస్టు 8: చంద్రగిరి మండలం, తొండవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ కమిటీ ఎన్నికలు జరుగుతుండగా అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మల్లం చంద్రమౌళిరెడ్డి అడ్డుకున్నారు.తన అనుచరులతో టీడీపీ బీసీ నాయకుడు మణికంఠపై దాడి చేశారు.పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం మణికంఠ తనపై జరిగిన దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

69 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు

చంద్రగిరి,ఆగస్టు8: చంద్రగిరి మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం జరిగాయి. మండలంలోని 55 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 11ఉన్నత పాఠశాలలకు ఈఎన్నికలు నిర్వహించారు.నూతనంగా ఎన్నికైన కమిటీలు పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తామని పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

భాకరాపేట, ఆగస్టు 8: చిన్నగొట్టిగల్లు మండలంలోని మూడు ఉన్నత పాఠశాలలు, 40 ప్రాథమిక పాఠశాలలకు గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. చిన్నగొట్టిగల్లు పాఠశాల చైర్మన్‌గా కరీముల్లా, వైస్ చైర్మన్‌గా నిరోషా, భాకరాపేట ఉన్నత పాఠశాల చైర్మన్‌గా సుధాకర్, వైస్‌చైర్మన్‌గా తస్లీమ్, రంగన్నగారిగడ్డ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా పార్వతి, వైస్ చైర్మన్‌గా ఆరిఫాను ఎన్నుకున్నారు. ఈఎన్నికలను ఎంఈవోలు సత్యనారాయణ, గోపీనాథ్ పర్యవేక్షించారు.

తేనెటీగల దాడిలో గూడలివాసి మృతి


అశోక్ మృతదేహం

కోట, ఆగస్టు 8: మండలంలోని గూడలిలో గురువారం తేనెటీగల దాడిలో ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు... గూడలికి చెందిన పూర్ణ అశోక్ (35) ఉదయాన్నే స్వర్ణముఖి నదిలో బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ కొండ తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడిన అశోక్‌ను కుటుంబసభ్యులు కోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా పరిస్థితి విషమంగా మారడంతో నెల్లూరుకు తరలించారు. మార్గమధ్యంలో మృతి చెందడంతో మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చేశారు. కాగా ప్రైవేట్ ఆస్పత్రిలో అశోక్‌కు చికిత్స చేయడంలో నిర్లక్ష్యం చేశారంటూ కుటుంబ సభ్యులు వైద్య సిబ్బందిని నిలదీశారు. రెండు గంటలపాటు ఆస్పత్రి యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు.

58 ఎస్ఎంసీలు ఏకగ్రీవం


ఎర్రావారిపాళెం మోడల్ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎంపికైన ఉదయ్

ఎర్రావారిపాళెం, ఆగస్టు 8: మండలంలోని 47 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో, 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ మోడల్ స్కూళ్లలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మండలంలోని మొత్తం 58 పాఠశాలల్లో టీడీపీ మద్దతుదారులు ఎస్ఎంసీ చైర్మన్లుగా ఎన్నిక కావడం విశేషం.

మంగళం జడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా షేక్ భాను


నూతన ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న సభ్యులు

మంగళం, ఆగస్టు 8: మంగళం ట్రెండ్స్ జడ్పీ ఉన్నతపాఠశాలలో గురువారం జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో చైర్మన్‌గా షేక్ భాను, వైస్ చైర్మన్‌గా పి.శ్రీరాములును కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు తెలిపారు.మండల టీడీపీ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, పంచాయతీ టీడీపీ అధ్యక్షులు సురేష్ నాయుడు, ఈశ్వరయ్య, చలపతి, పెరుగు భాస్కర్‌రెడ్డి, శశిధర్‌బాబు, ఉపాధ్యాయులు కృష్ణమ నాయుడు, మనోహర్, జగన్నాధరావు, చంద్రశేఖరయ్య, వసుంధర, మునిరత్నం, వెంకటేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా విద్యాకమిటీ ఎన్నికలు

తిరుపతి రూరల్, ఆగస్టు 8: తిరుపతి రూరల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 45 ప్రైమరీ, ఒక యూపీ, 10 హైస్కూళ్లతో కలిపి మొత్తం 57 పాఠశాలల్లో ఎన్నికలు సజావుగా జరిగాయని, సభ్యులు విద్యాకమిటీలను ఎన్నుకున్నారని ఎంఈవో దేవరాజులరెడ్డి పేర్కొన్నారు.

మాన్యువల్ స్కావెంజర్ల జిల్లా సర్వే కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 8: మాన్యువల్ స్కావెంజర్ల జిల్లా సర్వే కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కమిటీలో పారిశుధ్య కార్మికుల కొరకు పనిచేసే ఎన్‌జీఓల ప్రతినిధులు ఇద్దరు, పారిశుధ్య కార్మికుల ప్రతినిధులు ఇద్దరు, వీరిలో ఒకరు మహిళ సభ్యులుగా ఉంటారని వెల్లడించారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో ఈనెల 12వ తేదీలోగా తిరుపతి కలెక్టరేట్‌లోని ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. పూర్తి వివరాలకు 63011 01354 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

రామకృష్ణ ఆశ్రమంలో నేడు యువజన సదస్సు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 8: తిరుపతి శ్రీరామకృష్ణ ఆశ్రమ 9వ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు యువజన సదస్సు నిర్వహించనున్నట్లు ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి ఉపాధ్యాయ సదస్సు జరుగుతుందని తెలిపారు.





నేటినుంచి నృత్యపోటీలు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 8: తిరుపతికి చెందిన రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి స్థానిక మహతి వేదికగా నృత్యపోటీలు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన గోడపత్రికను గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఆగస్టు తొమ్మిదో తేదీ నుంచి 11వ తేదీ వరకు ఈ పోటీలు రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకూ జరుగుతాయి. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గుండాల గోపినాథరెడ్డి, కేఎస్ రాజ, శ్రీరాములు యాదవ్, టి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సేవ్ వయనాడ్ ప్లకార్డుల ప్రదర్శన



తిరుపతి(విద్య), ఆగస్టు 8: స్థానిక రాఘవేంద్రనగర్‌లోని రెడ్‌చెర్రీస్ పాఠశాలలో చదివే విద్యార్థులు గురువారం కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులకు మద్దతుగా పాఠశాలలో సేవ్ వయనాడ్ ప్లకార్డులను ప్రదర్శించారు. ఇటువంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వారికి అందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నిరాశ్రయులకు తమ వంతు సాయం అందించాలని కోరారు. టీచర్లు పాల్గొన్నారు.

బంగారమ్మకాలనీలో సమస్యలను పరిష్కరించండి

తిరుపతి(జీవకోన),ఆగస్టు8:నగరపరిధిలోని తిమ్మినాయుడుపాళెం హరిజనవాడ సమీపంలో బంగారమ్మ కాలనీలో తమ సమస్యలను పరిష్కరించాలని అర్బన్ తహసీల్దారు భాగ్యలక్ష్మిని అంబేడ్కర్ యువజనసంఘం నగర అధ్యక్షుడు కాయం వెంకటరత్నం కోరారు. సర్వే నెంబరు 199ఏలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇండ్లు నిర్మించుకుని కొన్ని సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నామని తెలిపారు. స్థానికంగా ఉన్న వైసీపీ కక్షిదారులు హరిజనవాడలో ఎవరైనా చనిపోతే ఇళ్ల మధ్యలో పూడ్చిన సందర్భాలను గుర్తు చేశారు. ఇలాంటి పరిణామాలు భవిష్యత్తులో చోటు చేసుకోకుండా చూడాలని విన్నవించారు.

పర్యాటక అభివృద్ధికి మెరుగైన అవకాశాలు


ఒబెరాయ్ సంస్థకు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్, ఆగస్టు 8: ఆతిథ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి జిల్లా వ్యాప్తంగా మెరుగైన అవకాశాలు ఉన్నాయని, తద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ వెంకటేశ్వర్ ఉద్ఘాటించారు. గురువారం ఉదయం ఆయన రెవెన్యూ, పర్యాటక శాఖల అధికారులతో కలసి టూరిజం కార్పొరేషన్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాన్ని ఆనుకుని ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి కేటాయించిన 20ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను సంబంధిత అధికారుల ద్వారా ఆరాతీశారు. ఇదే అంశంపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఒబెరాయ్ వంటి సెవెన్‌స్టార్, హయత్ వంటి ప్రముఖ హోటల్స్ జిల్లాలో ఏర్పాటుచేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని చెప్పారు. ప్రభుత్వానికి రెవెన్యూ సమకూరుతుందన్నారు. ఆర్డీవో నిషాంత్‌రెడ్డి, జిల్లా పర్యాటక శాఖాధికారి రూపేంద్రనాథ్, జ్యాక్యూరేటర్ సెల్వం, తదితర అధికారులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టండి

సీఎండీ కె.సంతోషరావు


మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 8: సదరన్ డిస్కం పరిధిలో వున్న ఐదు జిల్లాల్లో విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ సీఎండీ కె.సంతోషరావు ఆదేశించారు. తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయ ప్రాంగణంలోని అనెక్స్ భవనంలో గురువారం ఐదు జిల్లాల ఎస్ఈలు, ఈఈలు, జీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ అంతరాయాల వల్ల కలిగే నష్టాలు, ఫలితాలపై ఉన్నత స్థాయినుంచి క్షేత్రస్థాయి వరకు ఉద్యోగులు ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు పదేపదే విఫలమైతే ఆ ప్రాంతంలో విధినిర్వహణలో వున్న అధికారులు, సిబ్బందిపై కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. మొండి బకాయిలను వసూలు చేయాలని, ప్రతినెలా వినియోగ బిలుల్లను ఏపీఎస్‌పీడీసీఎల్ యాప్‌ల ద్వారా చెల్లించేవిధంగా వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు వై.లక్ష్మీనరసయ్య, పి.అయూబ్‌ఖాన్, సీజీఎంలు జె.రమణాదేవి, కేఆర్ఎస్ ధర్మజ్ఞాని, జానకిరామ్, కె.ఆదిశేషయ్య, ఆర్.పద్మ, ఎన్.శోభావాలెంటీనా, జీఎంలు ఎం.కృష్ణారెడ్డి, పి.మురళి, రామచంద్రరావు, శ్రీకాంత్, సురేంద్రరావు, ఇస్మాయిల్, శ్రీనివాసులుతో పాటు ఐదు జిల్లాల ఎస్ఈలు పాల్గొన్నారు.

నిమజ్జనానికి వినాయకసాగర్‌లో ఏర్పాట్లు చేయండి


ఎమ్మెల్యే శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

తిరుపతి (జీవకోన), ఆగస్టు 8: వినాయక చవితిని పురస్కరించుకుని స్థానిక వినాయక సాగర్‌లో నిమజ్జనానికి అనుకూలంగా అన్ని ఏర్పాట్లు చేయాలని తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ కోరారు. గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిసి సాగర్‌లో ఏర్పాట్లపై వినతిపత్రాన్ని సమర్పించారు. కమిటీ సభ్యులు ఊకా విజయకుమార్, ఆర్‌సీ మునికృష్ణ, గుండాల గోపీనాథ్‌రెడ్డి, మాంగాటి గోపాల్‌రెడ్డి, కరాటే శ్రీనివాస్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, డీపీ ఆనంద్, మల్లారపు రవి, ఎన్వీఎం వెంకటేష్, రుద్రకోటి సదాశివం, గోపి, ప్రసాద్, వాసు, చెన్నం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎపిక్ కార్డుల విచారణ వేగవంతం చేయండి

ఎస్పీకి ఎమ్మెల్యే ఆరణి విజ్ఞప్తి

తిరుపతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఫేక్ ఎపిక్ కార్డుల కేసు విచారణ వేగవంతం చేయాలని, అదేవిధంగా గంజాయి అమ్మకాలను పుణ్యక్షేత్రాలైన తిరుపతి, తిరుమలలో పూర్తిగా అరికట్టాలని ఎస్పీ సుబ్బరాయుడిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. గురువారం ఉదయం ఎస్పీని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతుండటంతో యువత పెడదోవ పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన తనయుడు అభినయ్‌రెడ్డిలు తిరుపతిని గంజాయి కేంద్రంగా మార్చారని ఆరోపించారు. గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టేందుకు స్పెషల్ టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ చెప్పినట్లు ఆయన తెలిపారు. అలాగే దొంగ ఓట్ల కేసు నమోదై ఏడు నెలలు అవుతున్నా పురోగతి లేదన్నారు. ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసి పాత్రధారులనే కాకుండా సూత్రధారులను శిక్షించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.

చిత్తూరులో కనకదుర్గ గోల్డ్ లోన్స్ శాఖ ప్రారంభం


కనకదుర్గ గోల్డ్ లోన్స్ శాఖను ప్రారంభిస్తున్న జీఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

చిత్తూరు, ఆగస్టు 8: ఫైనాన్స్ రంగంలో 41 సంవత్సరాలుగా విశిష్ట సేవలందిస్తున్న కనకదుర్గ ఫైనాన్స్ లిమిటెడ్, కనకదుర్గ గోల్డ్ లోన్స్ నూతన శాఖను చిత్తూరులోని డీఐ రోడ్డులో గురువారం ఉదయం ప్రారంభించినట్టు జీఎం జె.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తమ సంస్థకు ఆర్‌బీఐ గుర్తింపు ఉందన్నారు. తమ సంస్థ రూ.5 వేల నుంచి రూ.50 లక్షల వరకు అతి తక్కువ వడ్డీకి రుణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. బంగారంపై ప్రతి గ్రాముకు అత్యధికంగా ఫైనాన్స్ లభిస్తుందన్నారు. అలాగే వ్యాపార, వ్యక్తిగత రుణ సౌకర్యానికి తమ సంస్థ ఎంతగానో దోహదపడుతుందని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎం నరసింహులు, బ్రాంచ్ మేనేజర్ ఉదయ్‌కుమార్, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

సచివాలయ సిబ్బందికి కమిషనర్ హెచ్చరిక

తిరుపతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల పట్ల జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఎమినిటీ, శానిటరీ, టౌన్ ప్లానింగ్, హెల్త్ కార్యదర్శులతోపాటు ఆయా విభాగాధిపతులతో గురువారం కచ్చపి ఆడిటోరియంలో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆయా విభాగాల సెక్రటరీల పరిధి, చేయాల్సిన పనుల వివరాలు తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. అన్ని విభాగాల సెక్రటరీలు కలసి మెలసి విధులు నిర్వహించాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని చెప్పారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగ ర్యాలీ



మువ్వన్నెల పతాకాలతో ర్యాలీ చేస్తున్న క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 8: జిల్లా క్రీడాధికారి సయ్యద్ సాహెబ్, సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో గురువారం సాయంత్రం హర్‌ఘర్ తిరంగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు క్రీడాకారులు, విద్యార్థులు, వివిధ క్రీడల కోచ్‌లు, ప్రభుత్వ పాఠశాలల పీఈటీలు త్రివర్ణ పతాకాలు, బ్యానర్లను ప్రదర్శిస్తూ మైదానంలో ర్యాలీ చేపట్టారు. క్రీడాకారులు వరుసక్రమంలో నిలబడి జాతీయగీతం ఆలపించారు. కోచ్‌లు ప్రేమ్‌నాథ్, ఆది, గోపి, హిందూజ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

తంబువానిగుంట హైస్కూల్ చైర్మన్‌గా రాజేంద్ర

తిరుపతి (జీవకోన), ఆగస్టు 8: తిరుపతి నగర పరిధిలోని 45వ డివిజన్ శివజ్యోతి నగర్‌లో ఉన్న తంబువానిగుంట మున్సిపల్ ఉన్నతపాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా కదిరి రాజేంద్ర ఎన్నికయ్యారు. ఈయన పాఠశాల చైర్మన్‌గా రెండవసారి ఎన్నికయ్యారు.

ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా

తిరుపతి (జీవకోన), ఆగస్టు 8: ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు యోగా కార్యక్రమం తిరుపతి సప్తగిరినగర్‌లోని రిలయన్స్ ట్రెండ్స్ ఫుట్‌వేర్ పక్కన గల కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘం ప్రాంగణంలో జరుగుతుందని నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం, సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు, ఆదివారం ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు రిజిస్ట్రేషన్ ఉంటుందన్నారు. 14వ తేదీ ఉదయం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఉచిత పరిచయ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు సంబంధిత లాగిన్‌లో సమాచారం పొందాలన్నారు. మరిన్ని వివరాల కోసం 63055 52431, 83284 26350 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 8: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన కేసులో నిందితుడిని అలిపిరి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఇన్‌చార్జి సీఐ జయనాయక్ కథనం మేరకు.. తిరుపతిలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో నూర్జహాన్, విజయకుమార్‌లు ల్యాబ్ టెక్నీషియన్లుగా పనిచేస్తున్నారు. వీరు చెన్నారెడ్డికాలనీలో ఒక గది అద్దెకు తీసుకుని గత కొద్ది నెలలుగా కలసి ఉంటున్నారు. ఈ క్రమంలో విజయకుమార్ తనతో పాటు పనిచేస్తున్న నూర్జహాన్‌ను వివాహం చేసుకుంటానని నమ్మించి మోసగించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.అయితే గూడూరులో శుక్రవారం విజయకుమార్ వివాహం చేసుకుంటున్నట్లు తెలిసింది. తనను మోసం చేసి వేరొక అమ్మాయిని వివాహం చేసుకోవడాన్ని జీర్ణించుకోలేని నూర్జహాన్ అలిపిరి స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ రాజశేఖర్ నిందితుడు విజయకుమార్‌ను అరెస్టు చేశారు.

జగన్‌సొంత డబ్బుతో సెక్యూరిటీ పెట్టుకోవచ్చుగా! : చింతా

అమరావతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్ల అధికారంలో ఉన్న ఒక కుటుంబం వేల కోట్ల రూపాయలు సంపాదించిందని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వేల కోట్ల రూపాయలున్న జగన్ సొంతంగా సెక్యూరిటీని పెట్టుకోవచ్చు కదా! అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి తన సెక్యూరిటీ కోసం రూ.100 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. తమకెవరికీ సెక్యూరిటీ లేదని.. తాము బయట తిరగడం లేదా అని అడిగారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వైఎస్సార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, జగన్, చంద్రబాబు ఎంత ఖర్చు చేశారో బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కోటా ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ మెటీరియల్ సిద్ధం

తిరుపతి(విద్య), ఆగస్టు 8: కోటా ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ డిజిటల్ స్టడీ మెటీరియల్ అసైన్‌మెంట్లను సిద్ధం చేసినట్టు ఐఐటీ-జేఈఈ, నీట్ ఫోరం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. 6,7,8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకోసం ఈ మెటీరియల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఫౌండేషన్ మెటీరియల్‌ను డిజిటల్ మొబైల్ వెర్షన్‌లో వాట్సాప్ ద్వారా పొందొచ్చని, స్టడీ మెటీరియల్‌తోపాటు అసైన్‌మెంట్స్ కూడా పొందొచ్చని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం ఐఐటీ, ఎంఈడీఎఫ్ అని టైప్ చేసి 98490 16661 నెంబర్ వాట్సాప్‌కు మెసేజ్ పంపించాలని సూచించారు.

హడలెత్తించిన జెర్రిపోతు



తిరుమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం ఓ భారీ జెర్రిపోతు అందరినీ హడలెత్తించింది. పాపవినాశనం గేట్ వద్ద వున్న కల్యాణవేదిక వద్దకు సుమారు ఏడడుగుల పొడవున్న జెర్రిపోతు రావడంతో భక్తులు, స్థానికులు, ఉద్యోగులు భయంతో పరుగులు తీశారు. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కరనాయుడికి సమాచారమివ్వడంతో ఆయన అక్కడికి చేరుకుని చాకచక్యంగా పట్టుకున్నాడు.పట్టుబడిన పామును తర్వాత దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.





ముగిసిన మారియమ్మన్ తిరుణాళ్ల


మారియమ్మన్‌కు గ్రామోత్సవం

తడ, ఆగస్టు 8: మండలంలోని కారూరు గ్రామదేవత మారియమ్మన్ తిరునాళ్ల గురువారం సాయంత్రం ముగిశాయి. మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమైన తిరునాళ్లలో భాగంగా బుధవారం అర్ధరాత్రి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు నైవేద్యం, సారె సమర్పించారు. గ్రామోత్సవం గురువారం సాయంత్రం వరకు నిర్విరామంగా జరిగింది. తిరునాళ్లను పురస్కరించుకుని గ్రామం బంధుమిత్రులతో కళకళలాడింది. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ గ్రామానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో మృతదేహం లభ్యం

వాకాడు, ఆగస్టు 8: అనుమానాస్పద స్థితిలో మృతదేహం వెలుగు చూసింది. వాకాడు ఎస్‌ఎఎల్‌సీఎఫ్ గ్రౌండ్ సమీపంలోని పొలాల్లో నీటిలో తేలుతున్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. కాగా మృతుతు గొల్లపాళెం గ్రామానికి చెందిన వి.కోటయ్యగా గుర్తించారు. 20 యేళ్ల క్రితం భార్య నుంచి దూరమై వాకాడు సమీపంలోని టెంకా యలతోపు వద్ద ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. కొంతకాలంగా కోటయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన కోటయ్య తిరిగి రాకపోవడంతో సరసమ్మ గాలిస్తూనే ఉంది. ఈక్రమంలో కోటయ్య పొలాల్లో విగతజీవిగా తేలాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ఎర్రచందనం స్వాధీనం : ఒకరి అరెస్టు

మంగళం, ఆగస్టు 8: అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసి, 18 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఐ విశ్వనాథ్ గురువారం సానిపాయ బేస్ క్యాంపు గుర్రపుదిబ్బ వైపు ఉన్న వీరబల్లి అటవీప్రాంతం నుంచి కూంబింగ్ చేపట్టారు. రాజంపేట వీరబల్లి ఫారెస్టు బీట్ పరిధిలో మాదిరెడ్డి గారిపల్లి సమీపానికి చేరుకోగా కొంతమంది వ్యక్తులు దుంగలను మోసుకెళుతూ కనిపించారు. వీరిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, టాస్క్‌ఫోర్సు పోలీసులను గమనించి దుంగలను పడేసి చెట్లపొదల్లోకి పారిపోయారు. ఒక వ్యక్తిని పట్టుకోగలిగారు. పట్టుబడ్డస్మగ్లర్ తమిళనాడు, తిరువణ్ణామలై జిల్లా జమునామత్తూరు తాలుకాకు చెందిన దొరస్వామి(47)గా గుర్తించారు. దీంతో ఆ ప్రాంతంలో పడి ఉన్న 18 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని మరో నలుగురి కోసం గాలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వ్యక్తితో పాటు దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌కు తరలించి సీఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుత్తూరు వార్తలు

కామధేనువుపై విహరించిన శ్రీకృష్ణుడు


కామధేనువు వాహనంపై ఊరేగుతున్న శ్రీకృష్ణభగవానుడు, పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

పుత్తూరు టౌన్, ఆగస్టు 8: ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 6 గంటలకు ద్రౌపది దేవి సమేత ధర్మరాజుల స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టుపీతాంబరాలతో స్వామి, అమ్మవార్లలను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ద్రౌపదిదేవి జన్మస్థలమైన చౌటూరు గ్రామానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ విచ్చేసి, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. వన్నియ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు అమ్మవారిని పూజించగా గాలి భాను ప్రకాష్ అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. సాయంత్రం యాదవ సంఘం ఆధ్వర్యంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణభగవానుడు కామధేనువుపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. కార్యక్రమంలో రవీంద్ర యాదవ్, వెంకటేష్ యాదవ్, వెంకటరామయ్య, జయచంద్ర, టీడీపీ నాయకులు జీవరత్నం నాయుడు, ఎంఎం ధనపాల్, డీజీ ధనపాల్, మాజీ చైర్మన్ యుగంధర్, వైస్ చైర్మన్ ఆనంద్, ఈశ్వరయాదవ్, బొబ్బిలి యాదవ్, ఆదిమందడి, ఎలుమలై రెడ్డి, అయ్యప్ప రెడ్డి, మణిరెడ్డి, కరుణకర్, నాగరత్న, రజిని తదితరులు పాల్గొన్నారు.

13న పుత్తూరు మండల సమావేశం

పుత్తూరు టౌన్, ఆగస్టు 8: ఈనెల 13న పుత్తూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఇందిరమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ మెంబర్లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వారి ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

అంగన్‌వాడీలకు ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం

పుత్తూరు, ఆగస్టు 8 : పుత్తూరు, వడమాలపేట మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పుత్తూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టాటా క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వెంకయ్య మాట్లాడుతూ గర్భాశయం, రొమ్ము, నోటి క్యాన్సర్ల మీద అవగాహన కల్పించారు. దాదాపు వంద మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పద్మజ, సూపర్‌వైజర్లు గీతాంజలి, సంధ్య, అనిత, మనీలా, రోజారమణి, టాటా ట్రస్ట్ కోఆర్డినేటర్ రెడ్డికుమారి పాల్గొన్నారు.

విద్యాలయాలు
భావితరాల భవిష్యత్తుకు మార్గదర్శకం


వడమాలపేటలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు సన్మానం

వడమాలపేట, ఆగస్టు 8: పాఠశాలలు విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తాయని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు చెప్పారు. వడమాలపేటలో పాఠశాల యాజమాన్య కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంఈవో పద్మావతి మాట్లాడుతూ 43 పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు సజావుగా జరిగాయన్నారు. వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ షబ్బీర్‌బాషా, కార్యదర్శి అలేఖ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమలో టీడీపీ నాయకులు ఉమాపతిరావ్, సురేష్ రాజు, ప్రవీణ్, హెచ్‌ఎం కరుణానవనీతం, ఏఎంపురం, వీఆర్వో చక్రవర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుత్తూరు : పుత్తూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో తిరుమల రాజు తెలిపారు. మండలంలోని 80 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 15 మినహా అన్ని పాఠశాలల్లో ఏకగ్రీవం అయ్యాయని వివరించారు. పుత్తూరు మెయిన్ పాఠశాలకు చైర్మన్‌గా దొరవేలు, వైస్ చైర్మన్‌గా సుజన, పరమేశ్వరమంగళంకు మణికంత, సుబ్బలక్ష్మి, గొల్లపల్లికు శ్రీనివాసులు, గీత, చెర్లోపల్లికు సుమలత, తేజలు ఎన్నికయ్యారని తెలిపారు.

విచ్చలవిడిగా బెల్టు షాపులు

మద్యం షాపుల సిబ్బందికి కాసుల పంట

వాకాడు, ఆగస్టు 8: మద్యం బెల్టు షాపులు వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయన్న విమర్శలున్నాయి. గత వైసీపీ హయాంలో నియమించిన మద్యంషాపుల సిబ్బంది బరితెగించి అదనంగా డబ్బు తీసుకొని బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు సైతం కాసులకు కక్కుర్తిపడి వాటిని ప్రోత్సహిస్తున్నారని చెబుతున్నారు. ఎన్నికల సమయంలో పోలీసులు, సెబ్ అధికారులు ఒకింత దృష్టిపెట్టి బెల్టు షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. దీంతో గాడిలో పడిందనుకుంటున్న తరణంలో మళ్లీ యథావిధిగా బెల్టుషాపులు తెరుచుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రారంభంలో మద్యంషాపుల సిబ్బంది అక్రమాలు చేయడానికి కొంచెం భయపడ్డారు. ఇంకా కొత్త మద్యంపాలసీ అమల్లోకి రాకపోవడంతో పాత ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారానే అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేసే సిబ్బంది, సూపర్‌వైజర్లు అత్యధికశాతం వైసీపీ సానుభూతిపరులే ఉన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ కొత్తపాలసీ అమల్లోకి వస్తే ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండవని, ఎలాగూ తమను మళ్లీ ఉద్యోగాల్లోకి తీసుకోరని బరితెగించి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. బెల్టు షాపులకు మద్యం షాపుల సిబ్బంది ఒక్కో బాటిల్‌కు రూ.10 నుంచి రూ.20 అదనంగా సొమ్ము చేసు కుంటున్నారన్న విమర్శలున్నాయి. ఇకబెల్టు షాపులను కట్టడి చేయాల్సిన సెబ్ సిబ్బంది నెలవారీ మామూళ్లకు అలవాటుపడ్డినట్లు తెలుస్తోంది. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో సుమారు 90కు పైగా బెల్టుషాపులున్నాయి. దీంతో ఒక్కో బెల్టుషాపు నుంచి సెబ్ సిబ్బంది రూ.5వేలు మేర నెలవారీ మామూళ్ల వసూళ్లు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. సుమారు రూ.4.10 లక్షల రూపాయలు నెల వారీగా సెబ్ సిబ్బంది వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా విచ్చలవిడిగా బెల్టుషాపులను నిర్వహిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మద్యం బెల్టుషాపులను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా విగ్రహ పునః ప్రతిష్ఠాపన

పెళ్లకూరు ఆగస్టు 8: మండలంలోని చెంబేడులో నూతనంగా నిర్మించిన నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన వేడుకలు గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో హోమం, పూర్ణహుతి, మహాకుంభాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రభాకర్‌రెడ్డి వెంకట రాఘవరెడ్డి, మహేష్‌రెడ్డి, మహేంద్రరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం: కురుగొండ్ల


తిరుపతి - విజయవాడ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 8: త్వరలో రాష్ట్ర మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. గురువారం వెంకటగిరి ఆర్టీసీ డిపో నుంచి తిరుపతి, విజయవాడకు రెండు కొత్త బస్సు సర్వీసులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ హయాంలో డిపోలో నడుస్తున్న సర్వీసులను రద్దు చేసి ప్రయాణికులను ఇబ్బంది పెట్టార న్నారు. వైసీపీ సభలకు ఆర్టీసీ బస్సులను అడ్డగోలుగా వాడుకుందన్నారు. అయితే బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్టీసీ నష్టపోయిందన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక ఆర్టీసీని గాడిలో పెడుతున్నారన్నారు. ఇందులో భాగంగా కొత్త సర్వీసులు ప్రారంభమవుతున్నాయన్నారు. ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించి ప్రమాదాలు కొని తెచ్చుకోకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తే సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకుంటారన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు, వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, పోలేరమ్మ దేవస్థాన మాజీ చైర్మన్ జి.మురళీకృష్ణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ బి.రాజేశ్వరరావు, వెంకటగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు గంగాధర్, రూరల్ టీడీపీ అధ్యక్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి, ఏ.సత్యనారాయణ, ఆర్టీసీ డీఎం రామకృష్ణ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎస్ఎంసీ ఎన్నికలు: విజయశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 8: సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రజాస్వామ్యబద్ధంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే విజయశ్రీ చెప్పారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... నియోజకవర్గంలో 392 పాఠశాలలకు గాను 387 పాఠశాలల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్ఎంసీ ఎన్నికల్లో భయభ్రాంతులకు గురిచేసి పోలీసులను పెట్టి జరిపించినట్లు విమర్శించారు. అంతేకాకుండా అమ్మఒడి అంటూ ఎంతోమంది తల్లిదండ్రులకు మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్‌లో చెప్పిన విధంగా సీఎం చంద్రబాబు అన్ని పథకాలను అమలు పరుస్తున్నారన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడే విధంగా ఎన్నికలు జరిగాయన్నారు. రెండు పాఠశాలల్లో హెచ్‌ఎంలు నిబంధనలను పాటించలేదని వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రఫి, శ్రీనివాసులునాయుడు, రమేష్‌నాయుడు, మురళీరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గంగాప్రసాద్, కన్నెమ్మ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

- **తడ**: మండలంలో మొత్తం 49 పాఠశాలలు ఉండగా, అందులో 45 పాఠశాలల్లో ఎస్ఎంసీలు ఏకగ్రీవమయ్యాయి. వాటంబేడుకుప్పం పాఠశాలలో కోరంలేక వాయిదా పడినట్లు ఎంఈవో మల్లికార్జున్‌రావు తెలిపారు.
- **చిట్టమూరు**: మండలంలో గురువారం జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో వైసీపీ నాయకుల ప్రయత్నాలను విద్యార్థుల తల్లిదండ్రులు తిప్పికొట్టారు. టీడీపీ బలపరిచిన వ్యక్తులకే వైసీపీ సానుభూతిపరుల చేతులెత్తారు. మండలంలో 82 పాఠశాలలకు గాను 81 స్కూళ్లల్లో టీడీపీ బలపరిచిన వ్యక్తులు చైర్లన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మెట్టు ఉన్నత పాఠశాలలో వైసీపీ బలపరిచిన వ్యక్తి చైర్మన్ కాగా, వైస్‌చైర్మన్‌గా టీడీపీకి దక్కింది. యాకసిరి ఉన్నత పాఠశాల ఎన్నిక వాయిదా వేసినట్లు ఎంఈవో కృష్ణయ్య తెలిపారు.
- **దక్కిలి**: మండలంలో 62 పాఠశాలల్లో టీడీపీ సానుభూతిపరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- **వెంకగటగిరి టౌన్**: వెంకటగిరి మండల పరిధిలోని 101 పాఠశాలలు ఉండగా వాటిలో 100 పాఠశాలలకు ఏకగ్రీవంగా ఎన్నికలు గురువారం ముగిశాయి. ఒక్క పాఠశాలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించలేదని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.
- **నాయుడుపేట టౌన్**: నాయుడుపేట పట్టణం, మండలంలో ఉన్న 78 ప్రభుత్వ పాఠశాలల్లో 47 పాఠశాలల్లో ఏకగ్రీవం కాగా, 31 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈవో మునిరత్నం తెలిపారు.
- **దొరవారిసత్రం**: మండలంలో 65 పాఠశాలలు, బీసీ గురుకులం, మోడల్ స్కూల్, కేజీబీవీల్లో ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. వీటిలో 58 పాఠశాలలు ఏకగ్రీవమయ్యాయి. 7 పాఠశాలల్లో ఓటింగ్ జరిగింది.
- **ఓజిలి**: మండలంలోని 64 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన ఎన్నికల్లో టీడీపీ సానుభూతిపనులు 63 స్కూళ్లలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పున్నేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఎన్నికల్లో వైసీపీ సానుభూతిపరులు విజయం సాధించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఉద్రిక్తత తలెత్తడంతో ఎంఈవో శైలజ, ఎస్‌ఐ రవిబాబు సర్దుబాటు చేశారు.
- **గూడూరు అర్బన్**: పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 89 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 85 పాఠశాలలు ఏకగ్రీవమయ్యాయి. అయ్యవారిపాళెం ప్రాథమిక, ప్రాథమికోన్నత, మేగనూరు ప్రాథమికోన్నత, విందూరు ఉన్నత పాఠశాలలను కూడా టీడీపీ సానుభూతిపరులు చేజిక్కించుకున్నారు.
- **వాకాడు**: మండలంలోని 72 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎంఈవో నసీం అలీ తెలిపారు.
- **చిల్లకూరు**: మండలంలో 72 పాఠశాలుండగా 70 స్కూళ్లలో ఎన్నికలు జరిగాయి. పారిచర్లవారి పాళెం ఉన్నత పాఠశాల, ఓడూరు ప్రాథమికోన్నత పాఠశాలల్లో కోరం లేక వాయిదా పడ్డాయి. 50 ఏకగ్రీవం కాగా, 20 స్కూళ్లలో ఎన్నికలు జరిగాయి. అన్నీ కూటమి కైవసమయ్యాయి.
- పెళ్లకూరు: మండలంలో 65 ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. గతంలో ఏ ఎన్నికైనా వైసీపీ హవా కొనసాగగ ఈ ఎన్నికల్లో అందుకు భిన్నంగా టీడీపీ హవా కొనసాగడంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.
- **కోట**: మండలంలో 77 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, గురుకుల హాస్టళ్లకు పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలు జరిగాయి. స్వల్ప సంఘటన మినహా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో అధికార టీడీపీ మద్దతుదారులే పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్లుగా ఎన్నికయ్యారు. 27 పాఠశాలలను ఏకగ్రీవం చేసుకున్నారు. మిగతా ఎన్నికలు జరిగిన పాఠశాలల్లో కూడా దాదాపుగా కూటమి మద్దతుదారులే చైర్మన్లుగా ఎన్నికయ్యారు. గోవిందపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో చైర్మన్‌ను ఎన్నుకోగా వైస్‌చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. కోట మండలంలోని గోవిందపల్లి ఉన్నత పాఠశాలలో 217 మంది టీడీపీ, వైసీపీ మద్దతుదారులు ఎన్నికల హాల్‌లోకి ప్రవేశించారు. ఓటర్లను ప్రలోభ పెడుతున్నారంటూ రెండు వర్గాలు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ బాహాబాహీకి దిగారు. పరిస్థితి గమనించిన విద్యాశాఖ అధికారులు అక్కడ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ ఎన్నికను వాయిదా వేసింది. అదే విధంగా ఊనుగుంటపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య చైర్మన్ పదవి తమ వర్గానికే కావాలంటూ బాహాబహీకి దిగడంతో ఆ ఎన్నికను వాయిదా వేసినట్లు ఎంఈవో మస్తానయ్య తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యం


మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, ఆగస్టు 8 : కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. గురువారం ఆయన పట్టణంలో 40 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. మౌలిక సదుపాయాలు, అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులకు పలు సూచనలు చేశారు. ఇక్కడి ఆస్పత్రిలో గుండెపోటు బాధితులకు రూ.50 వేల విలువైన ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వీటిని రోగులకు ఉచితంగా వేస్తారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖరీదైన మందులు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. గత వైసీపీ పాలనలలో సర్కారు ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం లేకుండా పోయిందన్నారు. వివిధ పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్ సౌకర్యం, కాన్పులకు ప్రత్యేక వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని చెప్పారు. కాగా ఆస్పత్రికి దంత వైద్యులు సక్రమంగా రావడం లేదని తెలుసుకున్న ఆయన తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఎక్స్‌రే గది మూతవేసి ఉండటం గమనించి వైద్యుడు జిలానీని ప్రశ్నించారు. రేడియాలజిస్టు రాలేదని చెప్పడంతో మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఇకపై చూస్తూ ఊరుకోబోమన్నారు. అనంతరం వైద్యులు, సిబ్బంది హాజరు పట్టీని తనిఖీ చేశారు.

గొల్లపల్లి హైస్కూల్ చైర్మన్‌గా మునిశ్రీనివాసులు


కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు

పుత్తూరు టౌన్, ఆగస్టు 8: పుత్తూరు జడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా ముని శ్రీనివాసులు, వైస్ చైర్మన్‌గా గీతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్లు తమకు పదవి రావడానికి కృషి చేసిన టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్యను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారిని గంజి మాధవయ్య శాలువాలు, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గుంతలున్నాయి జాగ్రత్త...!

- ప్రమాదకరంగా మాంబట్టు సెజ్ రోడ్డు


మాంబట్టు రోడ్డులో ఏర్పాటు చేసిన సూచిక

తడ, ఆగస్టు 8: గత ప్రభుత్వం రోడ్లను పట్టించుకోలేదు. ఎన్నికల సమయంలో అరకొరగా ప్యాచ్ వర్కులు చేసి మమ అనిపించారు. చినుకులు పడటంతోనే మళ్లీ రోడ్లన్నీ ఛిద్రమైపోయాయి. మాంబట్టు సెజ్‌లో ఉన్న రోడ్డు ఏపీఐఐసీ అధీనంలో ఉంది. సెజ్‌లో సుమారు 15 వరకు భారీ, మధ్య తరహా పరిశ్రమలున్నాయి. ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. నాలుగేళ్లుగా ఇక్కడి రోడ్లను అధికారులు పట్టించుకోకపోవడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతోపాటు ఏడాది క్రితం అపాచీ పరిశ్రమకు దగ్గర్లో చిన్న కల్వర్టు కూలిపోయింది. ఆ సమయంలో రాకపోకల కోసం అప్పటికప్పుడు కల్వర్టు ను పూడ్చేశారు. ప్రస్తుతం అక్కడ కూడా భారీ గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గుంతలకు సూచికబోర్డులను పెట్టారు. అయినా అధికారులు స్పందించడం లేదు. ఇకనైనా సెజ్ రోడ్డును గుంతలు లేకుండా మరమ్మలు చేపట్టాల్సి ఉంది.

తేనె టీగల దాడిలో యువకుడి మృతి


అశోక్ మృతదేహం

కోట, ఆగస్టు 8: మండలంలోని గూడలిలో గురువారం తేనె టీగల దాడిలో యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... గూడలికి చెందిన పూర్ణ అశోక్ (35) ఉదయాన్నే స్వర్ణముఖి నదిలో బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ హఠాత్తుగా అశోక్‌పై కొండ తేనె టీగలు దాడి చేశాయి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను కుటుంబసభ్యులు కోటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకురాగా అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలించారు. మార్గమధ్యంలో యువకుడు మృతి చెందడంతో మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చేశారు. కాగా ప్రైవేట్ ఆసుపత్రిలో అశోక్‌కు చికిత్స చేయడంలో నిర్లక్ష్యం చేశారంటూ కుటుంబసభ్యులు వైద్య సిబ్బందిని నిలదీశారు. రెండు గంటలపాటు ఆసుపత్రి యాజ మాన్యంతో వాగ్వాదానికి దిగారు. స్థానిక పెద్దల చొరవతో అశోక్ కుటుంబసభ్యులు ఆసుపత్రి నుంచి వెళ్లిపోయారు. అశోక్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

20 ఎకరాల్లో సర్వేపై రగడ


అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

కోట, ఆగస్టు 8: మండలంలోని గున్నంపడియ వద్ద గురువారం చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్ భూముల సర్వేకు సంబంధించి కొద్ది సేపు వాగ్వాదాలు జరిగాయి. కోస్టల్ కారిడార్‌కు కొత్తపట్నం పంచాయతీలో 444 ఎకరాలు వెళ్లనున్నాయి. ఈ నేపథ్యంలో 424 ఎకరాల సర్వే పూర్తైంది. మిగతా 20 ఎకరాల్లో సర్వే చేస్తుండగా చిల్లకూరు మండలం పల్లెపాళెంకు చెందిన కొంతమంది తాము కోట మండల పరిధిలో ఉన్న భూములను సాగు చేసుకుంటున్నామని పరిహారం ఇవ్వాలని, పేర్లు నమోదు చేసుకోవాలంటూ పట్టుబట్టారు. దీంతో తహసీల్దారు జయజయరావు, డీటీ మల్లికార్జున, సర్వే అధికారులు రెండు మండలాల రైతులతో చర్చించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు మిగతా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు.

ఎన్‌బీకేఆర్‌లో జాతీయ సదస్సు


మాట్లాడుతున్న విభాగాధిపతులు

కోట, ఆగస్టు 8: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్విరాల్‌మెంటల్ ఎఫెక్ట్ అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సూళ్లూరుపేటకు చెందిన జువాలజీ విభాగాధిపతి శ్రీనివాస్, రసాయనశాస్త్ర విభాగాధిపతి సుబ్రహ్మణ్యంశాస్త్రి, ఫిజిక్ విభాగాధి పతి డాక్టర్ రాజా పాల్గొన్నారు. ప్రకృతి దైవంతో సమానమంటూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రకృతిని పరి రక్షించుకుందామంటూ పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్, ఎన్ఎస్ఎఫ్ ఆఫీసర్ డాక్టర్ జి.శ్రీనివాసులు, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఓడిఎఫ్ సర్వే పక్కాగా నిర్వహించాలి


పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేస్తున్న ఎంపీడీవో

తడ, ఆగస్టు 8: ఓడిఎఫ్(ఓపెన్ డెఫకేషన్ ఫ్రీ) సర్వే పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో విజయకుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలో ఇంటింటి కొళాయి, తాగునీరు, పారిశుధ్యం, బహిరంగ మల విసర్జనలపై వివరాలు నమోదు చేయాల్సి ఉందన్నారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఈ సర్వే నిర్వహించి 15వ తేది నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై సమీక్ష



వాకాడు, ఆగస్టు 8 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీల అభివృద్ధిపై కార్యదర్శులతో ఎంపీడీవో వెంకటేశ్వర రావు సమీక్షించారు. విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ తదితరాలపై పలు సూచనలు చేశారు. ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.40 కోట్లు

తిరుమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.40 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి, గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 75,109 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,285 మంది తలనీలాలు సమర్పించారు.

హడలెత్తించిన జెర్రిపోతు



తిరుమల, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి):తిరుమలలో గురువారం ఓ భారీ జెర్రిపోతు అందరినీ హడలెత్తించింది. పాపవినాశనం గేట్ వద్ద వున్న కల్యాణవేదిక వద్దకు సుమారు ఏడడుగుల పొడవున్న జెర్రిపోతు రావడంతో భక్తులు, స్థానికులు, ఉద్యోగులు భయంతో పరుగులు తీశారు. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కరనాయుడికి సమాచారమివ్వడంతో ఆయన అక్కడికి చేరుకుని చాకచక్యంగా పట్టుకున్నాడు.పట్టుబడిన పామును తర్వాత దట్టమైన అడవిలో విడిచిపెట్టాడు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు



శ్రీకాళహస్తిలోని జడ్పీ ఉన్నత పాఠశాల నూతన యాజమాన్య కమిటీ , ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సురేష్‌రెడ్డితో ప్రమాణం చేయిస్తున్న ప్రిన్సిపాల్

శ్రీకాళహస్తి, ఆగస్టు 8: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. చైర్మన్‌గా కె.విమల ఏకగ్రీవంగా ఎన్నికైంది. వైస్ చైర్మన్‌గా రాజా, 22మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాళహస్తి అర్బన్, రూరల్‌లో కలిసి మొత్తం 147పాఠశాలలున్నాయి. అన్నింటికి గురువారం ఏకగ్రీవంగా చైర్మన్లు ఎన్నికయ్యారు. ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య కొత్తగా ఎన్నికైన చైర్మన్లతో ప్రమాణ స్వీకారం చేయించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదం డ్రులు, పోలూరు శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణ, మోహన్‌గౌడ్, కేవీ ప్రతాప్, ఎంఎస్ రెడ్డి, గోపి, ఆర్ముగం, దొరబాబు, నాగరాజ, మురళి, మునిరాజా, శివారెడ్డి, మునిసుబ్బారెడ్డి, రాజేంద్ర, రూకేష్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం : మండలంలో ఉన్న 76 పాఠశాలల్లో ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఎంసీ ఎన్నికలు గురువారం నిర్వహించారు. కోవనూరు, అంజూరుపాళెం, కండ్లూరు, వేమలపూడి పాఠశాలల్లో చిన్నపాటి వివాదం చోటు చేసుకోవడంతో వీటిని నిలిపివేశారు. అయితే మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు వగత్తూరు మాజీ సర్పంచ్ సురేష్‌రెడ్డి అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. ఈయనతో ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి ప్రమాణం చేయించారు. అలాగే మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చంద్రబాబు అధ్యక్షుడుగా ఎన్నిక కావడంతో హెచ్‌ఎం వెంకటకృష్ణయ్య అతడితో ప్రమాణం చేయించారు.

ఏర్పేడు : మండలంలో 69 ప్రభుత్వ పాఠశాలలుండగా అందులో 66 పాఠశాలల్లో చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మునగలపాళెం ఉన్నత పాఠశాల, బండారుపల్లి, కృష్ణంపల్లి ప్రాథమిక పాఠశాలల్లో మాత్రమే ఎన్నికలు జరిగాయి. మునగలపాళెం పాఠశాలలో కాసింది అనే మహిళ చైర్మన్‌గా ఎన్నుకోబడింది. అలాగే కృష్ణంపల్లి ప్రాథమిక పాఠశాలలో పుష్ప చైర్మన్‌గా ఎన్ని కైంది. అలాగే బండారుపల్లి ప్రాథమిక పాఠశాలలో మునిరాములురెడ్డి చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో 52 పాఠశాలల్లో ఏకగ్రీవంగా చైర్మన్లను ఎన్నుకోగా 10 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. పల్లమాల ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికకు డీఈవో శేఖర్ పాల్గొని పలు సూచనలు చేశారు. తిమ్మాభూపాలపురం, పార్లపల్లి, పచ్చాలమ్మ గిరిజన కాలనీ, వేణుగోపాలపురం, మొక్కలచేను, తలారివెట్టు, కుక్కంబాకం, బీఎన్‌కండ్రిగ హైస్కూల్, కనమనంబేడులోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో జరిగిన ఎన్నికలలో టీడీపీ, వైసీపీ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలను ఎంఈవో-2 మునిసుబ్రమణ్యం పర్యవేక్షించారు.

వరదయ్యపాళెం : మండలంలో మొత్తం 69 పాఠశాలలుండగా అందులో 68 పాఠశాలలకు ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు.ఎంఈవోలు సరస్వతి, గున్నయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో అందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారి చేత ఎంఈవోలు ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా ఒక కళత్తూరు పాఠశాలలో మాత్రమే ఎస్‌ఎంసీ ఎన్నికలు జరగలేదు. బుధవారం భాకరాపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మరణించడం, పలువురు గాయపడటంతో ఈ పాఠశాలలో ఎన్నికలు జరగలేదు.

పిచ్చాటూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు గురువారం జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఒక్క అడవికొడియంబేడులో మాత్రం కోరం లేక వాయిదా పడింది. చేతులెత్తే విధానం ద్వారా ఆయా విద్య కమిటీల చైర్మన్‌లు, వైస్‌చైర్మన్‌లతో కలిపి 15మంది సభ్యులు, ఇద్దరు కో-ఆప్షన్ మెంబర్లుగా మండలంలోని 21 పంచాయతీలకు గాను 30 ప్రాథమిక పాఠశాలల్లో, ఆరు ఉన్నతపాఠశాలల్లో ఆయా ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. పులియంగుంట జడ్పీ హైస్కూలు చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన పరంధామ ఆచారి, శ్రీనివాసులను ఎంఈవో హేమమాలిని సన్మానించారు. ఇక్కడ కో-ఆప్షన్ మెంబర్‌గా ఎన్నికైన గోపి పాఠశాలకు శుద్ధి నీటి జలాలు అందించే యంత్రాన్ని వితరణ చేస్తున్నట్లు ఎంఈవో సమక్షంలో ప్రకటించారు.పిచ్చాటూరు జడ్పీ హైస్కూలు ఎస్‌ఎంసీ చైర్మన్‌గా వినాయకం, వైస్‌చైర్మన్‌గా పరిమళలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సత్యవేడు:మండలంలో మొత్తం 69 ప్రభుత్వ పాఠశాలలుండగా 67 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. మిగిలిన రెండు పాఠశాలల్లో ఎన్నిక వాయిదా పడింది. చెంగంబాకం, ఆంబాకం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 15కన్న తక్కువగా ఉండడంతో ఎన్నికలు నిర్వహించలేదని ఎంఈవో తెలిపారు.


నారాయణవనం : మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు తహసీల్దార్ జయరాములు, ఎంపీడీవో కృష్ణమూర్తి పర్యవేక్షణలో ప్రశాంతంగా జరిగాయని ఉపవిద్యాశాఖాధికారి ప్రభాకర్‌రాజు తెలిపారు. మండంలోని 34 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 4 ఉన్నత పాఠశాలల్లో జరిగిన ఎన్నికల్లో 36 పాఠశాలల్లో ఏకగ్రీవంగా, 10 పాఠశాలల్లో ఓటింగ్ ప్రక్రియ ద్వారా చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి : డీఈవో


విద్యార్థులకు నగదును అందజేస్తున్న డీఈవో శేఖర్

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 8: పేద విద్యార్థుల చదువుకు దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు బుచ్చినాయుడుకండ్రిగ కండ్రిగ గ్రామానికి చెందిన దాత వెంకటరమణ నాయుడు వితరణ చేసిన నగదును డీఈవో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థుల చదువుల కోసం దాత రూ. 14వేలు సహాయం చేయడం చాల సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మునిసుబ్రమణ్యం ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 8: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజ, కలశ పూజ, స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



శ్రీకాళహస్తి, ఆగస్టు 8: తొండమనాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల నూతన కమిటీ అధ్యక్షుడు అచ్యుతయ్య నగదు బహుమతి అందజేశారు. 590మార్కులు సాధించిన జి.యోగేష్‌కు రూ.5,116, 589 మార్కులు సాధించిన అబిలాష్‌కు రూ.5,106, 580 మార్కులు వచ్చిన దేవికి రూ.5,006 చొప్పున సాంఘిక ఉపాధ్యాయురాలు సుజాత దాతృత్వంతో ఈ నగదును అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ జైబున్నీసా బేగం, గ్రామస్తులు శివారెడ్డి, హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేన అగ్రనాయకులను కలిసిన కొట్టేసాయి



శ్రీకాళహస్తి, ఆగస్టు8: విజయవాడలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ఎమ్మెల్యే పిడుగు హరిప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ కోసం కృషి చేస్తున్న వారికి సముచిత స్థానం కల్పించాలన్నారు. పార్టీ పటిష్టత కోసం ప్రతిరోజు రూ.111 విరాళం అందిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న జనసేన శ్రీకాళహస్తి మండలాధ్యక్షుడు దండి రాఘవయ్యను అభినందించారు. అనంతరం అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, పార్టీ ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్‌ను కూడా కలిశారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దండి రాఘవయ్య, కిరణ్‌రామిశెట్టి, మునికుమార్, కొప్పల గోపి తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడికి ఘన స్వాగతం



రేణిగుంట/శ్రీకాళహస్తి, ఆగస్టు 8: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు తిరుపతి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనను బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సామాంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకుని వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

రేణిగుంట, ఆగస్టు 8: సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణపై ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో మూడు రోజులపాటు జరిగే శిక్షణా తరగతులను ఈవోపీఆర్డీ వెంకటరత్నమ్మ ప్రారంభించారు. గురువారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం కింద మండల పరిధిలోని ఎంపికైన ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొని చెత్త సేకరణ-ఆదాయ ఉత్పత్తి అనే అంశంపై వివరించారు. ఈ శిక్షణా తరగతుల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా అందించే బాధ్యత వీఆర్వోలదే

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 8: ప్రతి గ్రామంలో సకాలంలో రేషన్ సరుకులు అందే విధంగా వీఆర్వోలు పర్యవేక్షించాలని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఆర్వోలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ సరుకులు పంపిణీ సక్రమంగా జరిగే విధంగా చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ చంద్రబాబునాయుడు, సీనియర్ సహాయకుడు నాగరాజు పాల్గొన్నారు.

గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే



కేవీబీపురం, ఆగస్టు 8: మండలంలోని బ్రాహ్మపల్లిలో ఇటీవల నిర్మించిన గంగమ్మ ఆలయానికి గురువారం కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి గ్రామ ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజులనాయుడు, గోపినాథ్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా శివరాజు



ఏర్పేడు, ఆగస్టు 8: ఏర్పేడు పీహెచ్‌సీలో సీహెచ్‌వోగా పనిచేస్తున్న శివరాజు ఏపీ తెలుగునాడు మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన యూనియన్ సమావేశంలో శివరాజును జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పేడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్స్, పీహెచ్‌సీ సిబ్బంది శివరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి


మాట్లాడుతున్న చైర్మన్ అశోక్ రాజు

నారాయణవనం, ఆగస్టు 8: ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోక్‌రాజు తెలిపారు. గురువారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియేంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కళాశాలలోని అన్ని వసతులను వినియోగించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఉద్యోగాలు కోసం కాకుండా పదిమందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి విద్యార్థులు ఎదగాలని ఆశించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సుబ్బరాజు, ప్రిన్సిపాల్స్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధన్ రాజు, రమేష్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గంగజాతర

వరదయ్యపాళెం, ఆగస్టు 8: వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ పంచాయతీ పద్మావతిపురంలో శుక్రవారం నుంచి గంగజాతర జరగనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం 6గంటలకు పద్మావతిపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గోమాతకు పూజలు, సాయంత్రం 4గంటలకు నాగాలమ్మకు పొంగళ్లు, 10 పూజాది కార్యక్రమాలు, 11న గంగమ్మకు అంబళ్లు, మధ్యాహ్నం 2గంటలకు పొంగళ్లు, సాయంత్రం 6గంటలకు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

15 నుంచి నీలకంఠేశ్వరస్వామి ఉత్సవాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 8: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 15వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. 15న అంకురార్పణ, ధ్వజారోహణం, చప్పరం ఉత్సవం, 16న రెండవ తిరునాళ్లు, సూర్యప్రభ వాహనం, 17న మూడవ తిరునాళ్లు, చంద్రప్రభ వాహనం 18న నాలుగవ తిరునాళ్లు చిలుక వాహనం, 19న నందిసేవ, నందివాహనం, 20న రథోత్సవం, రథం, 21న కల్యాణోత్సవంచ, పార్వేట ఉత్స వం, గజ వాహనం, 22న గుంటకిందపల్లి, జింగిలిపాళెం గ్రామాలకు చప్పర ఉత్సవం, 23న ధ్వజావరో హణం, చప్పర వాహన సేవ, 24న పల్లకీ సేవ, రాత్రి ఏకాంత సేవతో ఉత్సవాలు ముగియనున్నట్లు ఈవో తెలిపారు.

పేదలకు అన్నదానం

శ్రీకాళహస్తి, ఆగస్టు 8: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం డొక్క సీతమ్మ స్ఫూర్తితో జనసేన ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత హాజరై సుమారు 250మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీర మహిళలు శారద, గాయత్రి, నిర్మల, లక్ష్మి, రాజ్యలక్ష్మి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

ఏర్పేడు,ఆగస్టు8:ముసలిపేడు పంచాయతీ బత్తినయ్య ఎస్టీకాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తన పుట్టిన రోజు పురస్కరించుకుని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజూరు చక్రధర్ గురువారం విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగరాణి, మాజీ సర్పంచ్ గీతా మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వరదయ్యపాళెం, ఆగస్టు 8: వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం పంచాయతీలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఇన్‌చార్జి ఏఈ శివప్రసాద్ తెలిపారు. విద్యుత్ మరమ్మతులు, స్తంభాల వద్ద చెట్ల తొలగింపు వంటి వాటి కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు ఇందుకు సహకరించాలని కోరారు.

ముక్కంటి సేవలో ఉపలోకాయుక్త జడ్జి

శ్రీకాళహస్తి, ఆగస్టు 8: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ఆంధ్రప్రదేశ్ ఉపలోకాయుక్త జడ్జి పి.రజని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆలయ పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

కోటేశ్వరరావుకు సన్మానం

ఏర్పేడు, ఆగస్టు 8: ఏర్పేడు మండలం మేర్లపాక పంచాయతీ కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన తోటకూర కోటేశ్వరరావు ఏపీ సచివాలయం వార్డు సమైక్య రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయన స్వగ్రామంలో గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు. మేర్లపాక సర్పంచ్ గంగాధర్, ఏర్పేడు ఎంపీటీసీ భరత్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు ఆయనను కోరారు. గ్రామస్తులు బట్టి మస్తాన్, హరినాథ్‌రెడ్డి, వెంకటరమణయాదవ్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్య

రేణిగుంట, ఆగస్టు 8: గాజులమండ్యం హరిజనవాడలో ఉంటున్న ఓ గృహిణి కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకివచ్చింది. ఎస్‌ఐ అనిల్ తెలిపిన వివరాల మేరకు హరిజనవాడలో కాపురం ఉంటున్న నీరజ(26) భర్త వినోద్ కుమార్ రేణిగుంట పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. వినోద్ కుమార్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. భర్తకు అక్రమ సంబంధం ఉందన్న అనుమానం పెంచుకుని బుధవారం అర్ధరాత్రి నీరజ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేణిగుంట డీఎస్పీ బదిలీ

రేణిగుంట, ఆగస్టు 8: రేణిగుంట డీఎస్పీ భవ్య కిషోర్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. భవ్య కిషోర్‌ను రాజమండ్రి సౌత్‌జోన్ డీఎస్పీగా బదిలీ కాగా తిరుపతి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వెంకటాద్రి రేణిగుంట డీఎస్పీగా బదిలీ అయ్యారు.

శ్రీకాళహస్తిలో అభివృద్ధి వేగవంతం


ఓటేరు కాలువ వద్ద శుభ్రం చేయిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 8: బొజ్జల సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే శ్రీకాళహస్తిలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే మురుగునీటి వ్యవస్థ ప్రక్షాళనపై అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆ తరువాత పురపాలక సంఘం అధికారులు మురుగుకాలువల ప్రక్షాళన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గురువారం టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్ సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించారు. ఓటేరు, కన్నలి, గొడ్డేరు, నాగులగుంట, చెంబేడు కాలువల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొజ్జల ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం పురపాలక సంఘ మంత్రి నారాయణతో చర్చించి అనతికాలంలోనే రూ.50 లక్షల నిధులను మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. పట్టణవ్యాప్తంగా 6.5 కిలోమీటర్ల మేర మురుగుకాలువలను ప్రక్షాళన పనులు చేపట్టినట్లు తెలిపారు.

లారీ కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



రేణిగుంట, ఆగస్టు 8: గాజుల మండ్యంలో లారీ కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అనిల్ వివరాల మేరకు గాజులమండ్యంలో గుర్తుతెలియని వ్యక్తి పుత్తూరు వైపు వెళ్లే వాహనాల కింద పడేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. వివరాలేమీ చెప్పకపోవడంతో అల్పాహారం పెట్టించారు. కొంత సేపటికి పుత్తూరు వైపు వెళుతున్న లారీ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ అనిల్ తెలిపారు.

కళత్తూరులో విషాదం


క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం, ఆగస్టు 8: భాకరాపేట ఘాట్ వద్ద బుధవారం లారీ బోల్తా పడిన ఘటనలో వరదయ్యపాళెం మండలం కళత్తూరుకు చెందిన నవీన్ యాదవ్(28) అనే కూలీ దుర్మరణంతో ఆ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఇతడికి భార్య, రెండేళ్ల కుమార్తె ఉంది. భార్య ఎనిమిది నెలల గర్భవతి. అదే గ్రామానికి చెందిన మరో ఆరుగురు కూలీలు తీవ్ర గాయాల పాలయ్యారు. వారు తిరుపతిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం ఆస్పత్రికి చేరుకుని డీఎంహెచ్‌వో శ్రీహరితో కలిసి గాయపడిన మల్లికార్జునయ్య, శేఖర్, మణిభూషణ్, వెంకటేష్, మణి, బాలయ్యను పరామర్శించారు. తీవ్రంగా గాయపడిన మల్లికార్జునయ్యకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ కూడా క్షతగాత్రులను పరామర్శించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



శ్రీసిటీ, ఆగస్టు 8: శ్రీసిటీ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువా రం శ్రీసిటీలోని మూడు వేర్వేరు ప్రదేశాల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్, శ్రీసిటీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ట్రేడ్ సెంటర్, బిజినెస్ సెంటర్, ఈఎంసీ కేంద్రం వద్ద శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యాక్సిలెంట్ పార్మా, బ్రేక్స్ ఇండియా, ఇసుజు, నిట్టాన్ ఇండియా, రాక్‌వర్త్, వెర్మీరన్, టిల్, ఈ-ప్యాక్ తదితర పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు, సూళ్ళూరుపేట గోకుల్ కృష్ణ ఇంజనీరింగ్ కాలేజీ, సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. తిరుపతి, నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ, తిరుపతి ఎన్‌టీఆర్ ట్రస్ట్‌కు చెందిన సిబ్బంది ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్, సీఎస్‌ఆర్ మేనేజర్ నిరీష సన్నారెడ్డి, హెచ్‌ఆర్ ప్రతినిధి శివకుమార్ రెడ్డి, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

ముక్కంటి క్షేత్రానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయండి

కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ఎమ్మెల్యే బొజ్జల విజ్ఞప్తి


కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాళహస్తి, ఆగస్టు 8: శ్రీకాళహస్తి క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు విజ్ఞప్తి చేశారు. ముందుగా విమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడును బొజ్జల సుధీర్‌రెడ్డి ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ద్వారా ముక్కంటి ఆలయ ప్రశస్త్యాన్ని, పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసే అవకాశాలను వివరిస్తూ కేంద్ర టూరిజం శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి గురువారం వినతిపత్రం సమర్పించారు. శ్రీకాళహస్తిలోని భరద్వాజ తీర్థం నుంచి కన్నప్ప కొండను కలుపుతూ కనకదుర్గమ్మ వెలసిన కనకాచలం వరకు రోప్‌వే నిర్మించేందుకు, అలాగే ఆలయం వద్ద క్యూకాంప్లెక్సు, రాతి నిర్మాణంతో మహాప్రాకారం, స్వర్ణముఖి నది అభివృద్ధి, ఆలయం వద్ద కళా ప్రాంగణం, సౌండ్ అండ్ లైట్‌షో వేదిక తదితర వాటిపై వినతిపత్రం అందజేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.114.06కోట్ల నిధుల వ్యయం అవుతుందని అంచనా నివేదికను సమర్పించారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు.